




రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సా): 6:26 (శుక్రవారం)
సహర్ (ఉ) : 4:50 (శనివారం)

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి




ఖమ్మం
KHAMMAM
5
శుక్రవారం, 22 మార్చి 2024



వాళ్లూ ఖమ్మం జిల్లా పరిధిలోని రైతులే.. కానీ అందరు రైతుల్లా వారికి రెండు పంటలకు సాగర్ జలాలు అందవు. జోన్ నిబంధనల రీత్యా ఖరీఫ్‌కు ఎలాగూ అవకాశమే లేదు.. కనీసం రబీలోనైనా పంటలను పండించుకుందామంటే సరిహద్దుల్లోని ఎగువ ప్రాంత ఆంధ్రా రైతులనుంచి అడ్డంకులు. భౌగోళిక కారణాల రీత్యా ఏర్పాటు చేసిన గ్రావిటీ కాలువలు వారికి శాపంగా మారాయి. ఇప్పుడా కష్టాల నుంచి వారు విముక్తి పొందబోతున్నారు. ఇది మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం మండలాల రైతుల గాథ. అయితే స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ, పట్టుదల వారికి వరంగా మారింది. ఖమ్మం జిల్లా అంతా నాగార్జున సాగర్ జోన్ 2 పరిధిలో ఉండగా, ఒక్క మధిర, ఎర్రుపాలెం మండలాల ఆయకట్టు మాత్రం సాగర్ జోన్ 3లో ఉంది. భౌగోళిక కారణాల రీత్యా సకాలంలో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. రైతుల కష్టాలు, కడగండ్లను చూసిన భట్టి విక్రమార్క.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మధిర, ఎర్రుపాలెం మండలాల ఆయకట్టును జోన్ 3 నుంచి జోన్ 2లోకి మార్పించారు. రెండు పంటలకూ నీరందించేందుకు రూ.800 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. సాగర్ జలాలను వైరా నదిలోకి విడుదల చేసి, అక్కడినుంచి చెక్‌డ్యామ్‌లు, పంప్‌హౌజ్‌లు, పైప్‌లైన్ల ద్వారా రైతులకు నీరందించనున్నారు. ఈ కొత్త పథకంలో రెండు మండలాల్లో 33 వేల ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణ జరగనుంది.

- జోన్ 3 నుంచి జోన్ 2లోకి మార్పు
- రూ.800 కోట్లతో చెక్‌డ్యామ్‌లు, పంప్‌హౌజ్‌లు, పైప్‌లైన్ల నిర్మాణానికి చర్యలు
- 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు రంగం సిద్ధం
- వైరా నది, కట్టలేరుపై చెక్‌డ్యామ్‌లు, పంప్ హౌజ్‌లు
- ఇక రెండు పంటలకూ సాగర్ జలాలు
- భట్టి పట్టుదల.. ఉత్తమ్ ఆచరణ..



సరిహద్దుల్లో సస్యశ్యామలం

మధిర నియోజకవర్గంలోని సాగర్ ఆయకట్టుకు ఆయుష్షు

మధిర టౌన్, మార్చి 21: నాగార్జున సాగర్ కాలువలు తవ్వి దశాబ్దాలు కావొస్తున్నప్పటికీ, ప్రతి ఏడాది సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలు ఇకపై కనుమరుగు కానున్నాయి. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో ఎక్కువ భాగం జోన్ 3లో ఉండటం వల్ల ఇక్కడి భూములకు సాగర్ జలాలు రావాలంటే అనేక సమస్యలు ఎదురయ్యేవి. సాగర్ జలాలు ఎగువన ఉన్న ఆంధ్రా ప్రాంతంలోని పెనుగొలను మేజర్‌ను దాటి ఇక్కడికి రావాల్సి ఉంటుంది. అయితే కరువు సమయాల్లో ఎగువన వున్న రైతులు నీళ్ల సక్రమంగా రాకుండా అడ్డుకునే వారు. అంతేగాక జోన్ 3పరిధిలో వున్న ఈ ప్రాంత పొలాలకు కేవలం రెండో పంటకే నీరు విడుదల చేయాలనే నిబంధన ఉండటంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సమస్యను ఏనాడో గుర్తించి, ఉమ్మడి ఏపీలో తాను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో జోన్ 3 కింద ఉన్న మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని సాగర్ ఆయకట్టును జోన్ 2లోకి మార్చేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే అదే సమయంలో రాష్ట్ర విభజన జరగడంతో భట్టి ప్రయత్నాలు ఆచరణలోకి రాలేదు. గత డిసెంబరులో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడం, తాను ఉప ముఖ్యమంత్రి కావడంతో భట్టి మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు. తాను పదవీ బాధ్యతలు చేపట్టిన రెండో రోజే సచివాలయంలోని తన చాంబర్‌కు జిల్లా ఇరిగేషన్ అధికారులను పిలిపించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఇటీవల సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మధిరకు తీసుకువచ్చి జోన్ 3లో ఉన్న మధిర నియోజకవర్గంలోని సాగర్ ఆయకట్టును ఇకపై జోన్ 2 కిందకు మారుస్తున్నట్లు ప్రకటన చేయించారు.ఈ మేరకు వెంటనే జీవోను కూడా విడుదల చేయించారు.

మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని సాగర్ ఆయకట్టును జోన్2లోకి మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకోసం అధికారులు రూ.800 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. చెక్‌డ్యామ్‌లు, పంప్‌హౌజ్‌లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయడం ద్వారా సాగర్ జలాలను అందించనున్నారు. జోన్ 3 పరిధిలోని ఎగువ ప్రాంతాల రైతులు నీటి ప్రవాహానికి ఆటంకాలు కలిగిస్తుండటంతో ఇందుకు అధికారులు పరిష్కారాలను రూపొందించారు.

రూ.800 కోట్లతో ప్రతిపాదనలు

సాగర్ ప్రధాన ఎడమకాలువ (21ఎంబీసీ) 51.70కి.మీ వద్ద 590 క్యూసెక్కుల నీటిని తీసుకొని తల్లాడ మండలం కొడవటిమెట్ట వద్ద వైరా నదిలో కలపనున్నారు. మధిర మండలంలోని వంగవీడు వద్ద వైరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి పంప్ హౌజ్ ఏర్పాటు చేసి అక్కడినుంచి 11 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా నాగవరప్పాడు సమీపంలో ఉన్న నిధానపురం మేజర్‌లోని సాగర్ కాలువలోకి నీళ్లను ఎత్తిపోయనున్నారు. దీంతో ఈ మేజర్ కింద ఎర్రుపాలెం మండలంలోని ఆరు గ్రామాల్లోని 4 వేల ఎకరాలతోపాటు మధిర మండలంలోని 11 గ్రామాలకు చెందిన 13వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. అంతేగాకుండా కొంతనీటిని కట్టలేరులో కలపనున్నారు. అదేవిధంగా ఎర్రుపాలెం మండలంలోని కట్టలేరుపైన అయ్యవారిగూడెం వద్ద చెక్‌డ్యామ్, పంప్ హౌజ్ నిర్మించి అక్కడి నుంచి 7 కిలోమీటర్లు పైప్‌లైన్ ద్వారా రాజుపాలెం గ్రామం వద్ద మైలవరం బ్రాంచ్ కెనాల్‌లోకి నీళ్లను లిఫ్ట్‌చేసి ఎర్రుపాలెం మండలంలోని 8 గ్రామాల్లోని 5 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నారు. ఇదే లిఫ్ట్ నుంచి 9 కిలోమీటర్లు మరో పైప్‌లైన్ ద్వారా గుంటుపల్లి గోపవరం వద్ద జమలాపురం మేజర్ కెనాల్‌లోకి నీళ్లను లిఫ్ట్ చేసి 9గ్రామాల్లోని 11వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నారు. ఈ 33వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం 322 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, దాని కోసం రూ.64.40 కోట్లు కేటాయించారు. రెండు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.35.6 కోట్లు, ఫీడర్ చానల్స్ నిర్మాణానికి రూ.167కోట్లు, పంప్ హౌజ్‌ల నిర్మాణానికి రూ.533కోట్లు మొత్తం రూ.800కోట్లతో అంచనాలు తయారుచేశారు. అన్ని అనుమతులు, డిజైన్లు పూర్తయి రూ.800 కోట్ల నిధుల విడుదలకు జీవో విడుదల అయ్యే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో జీవో ఆగిపోయింది,

ఇక రెండు పంటలకు సాగునీరు

రామకృష్ణ, ఇరిగేషన్, ఈఈ



నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద జోన్ 1లో నల్లగొండ జిల్లా, జోన్ 2లో ఖమ్మం జిల్లా, జోన్ 3లో ఆంధ్రా ప్రాంతంలోని కృష్ణాజిల్లా ఉంది. సాగర్ డ్యామ్‌లో నీటి లభ్యతను బట్టి జోన్ 1, జోన్ 2లలో ఉన్న ఆయకట్టుకు రెండు పంటలకు నీరు ఇచ్చే అవకాశం ఉంది. అయితే జోన్ 3కి మాత్రం రెండో పంటకే నీరు ఇచ్చే అవకాశం ఉంది. భౌగోళిక పరిస్థితుల రీత్యా మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని ఆయకట్టు జోన్ 3 పరిధిలో ఉంది. ఇక్కడి భూములకు గ్రావిటీ ద్వారా నీరు ఆంధ్రా నుంచి తిరిగి రావలసి ఉండేది. ఈ సమస్యను నివారించేందుకు ఈ మండలాలను జోన్ 2లో చేర్చి లిఫ్ట్‌ల ద్వారా నీటిని పంప్ చేయటం జరుగుతుంది. తద్వారా రెండు పంటలకు నీరు ఇవ్వవచ్చు.

ఆంధ్రా రైతులతో ఇబ్బందులుండవు..

ఎం. రామారావు, మాటూరుపేట



జోన్ 3లోని ఆంధ్రా ప్రాంతానికి చెందిన రైతులు సాగర్ కాల్వకు అడ్డుకట్టలు వేసి సాగునీటిని తెలంగాణ రైతులకు రాకుండా అడ్డుకునేవారు. దీంతో నిత్యం సాగునీటి కోసం ఘర్షణ పడాల్సి వచ్చేది. ఉప ముఖ్యమంత్రి భట్టి కృషితో మా ఇబ్బందులు తొలగనున్నాయి. సీతారామ ప్రాజెక్ట్ ఆగస్టుకు పూర్తయితే వైరా రిజర్వాయర్ ద్వారా వైరా నదిలో నీళ్లు పుష్కలంగా ఉంటాయి. కృష్ణా జలాలు ఆలస్యమైనా గోదావరి జలాలతో ఈ నూతన లిఫ్ట్‌లద్వారా మా భూములు సస్యశ్యామలం అవుతాయి.

'స్థానికత' వివాదం

తేలేదెన్నడు!?

- పోలవరం ముంపు ప్రాంతాల్లో విద్యనభ్యసించిన నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం
- తెలంగాణ ఉద్యోగాలకు స్థానికేతరులుగా పరిగణిస్తున్న నిబంధనలు
- సీఎంకు నివేదించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, మార్చి 21: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలవరం ముంపు ప్రాంతాల్లో విద్యనభ్యసించిన తెలంగాణ స్థానిక విద్యార్థులను తెలంగాణవాసులుగానే గుర్తించాల్సి ఉన్నా స్థానికత సమస్యకు పరిష్కారం లభించడం లేదు. రాష్ట్ర విభజన సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను పోలవరం ముంపు మండలాల పేరుతో ఏపీ పరిధిలో విలీనం చేశారు. ఫలితంగా భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల పరిధిలోని భద్రాచలం(రెవిన్యూ గ్రామం మినహాయించి) కూనవరం, చింతూరు, వరరామచంద్రాపురం, వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గంపాడు పలు గ్రామాలు ఏపీ పరిధిలోకి వెళ్లాయి.

దీంతో 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో జన్మించి పోలవరం ముంపు ప్రాంతాల్లో చదువుకొని పట్టభద్రులైన నిరుద్యోగులకు స్థానికత సమస్య ఏళ్లు గడుస్తున్నా తీరడం లేదు. వీరికి ఆధార్, రేషన్, ఓటరు కార్డు, నివాసం, కుల, ఏజెన్సీ ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తెలంగాణలోనే ఉన్నా ఉద్యోగ నోటిఫికేషన్‌లలో ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసే సమయంలో తెలంగాణలో స్థానికేతరులుగా చూపిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విధంగా రెండు నియోజకవర్గాల్లో సుమారు మూడు వేల మంది వరకు ఉండవచ్చని తెలుస్తోంది.

కొన్ని దశాబ్దాలుగా వారి తల్లిదండ్రులు, తాత ముత్తాతలు తెలంగాణలోనే ఉన్నా ప్రత్యేక పరిస్థితుల క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో పోలవరం ముంపు ప్రాంతాల్లో విద్యనభ్యసించిన వారికి స్థానికత అంశం పరిష్కరించాలని ఏళ్ల తరబడి అడుగుతున్నా పరిష్కారం లభించడం లేదని వారు వాపోతున్నారు. రాష్ట్రాల విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఎలాగైతే తెలంగాణలో చదివిన విద్యార్థులను జీవో నెం.674 ప్రకారం వారి తల్లిదండ్రుల స్థానికత ఆధారంగా స్థానికులుగా పరిగనిస్తున్నారో అదే రీతిలో తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఈ విషయమై తెలంగాణ స్థానికత అంశంలో తెలంగాణలో చదివిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ సీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నుంచే

నామా పోటీ

పార్టీ శ్రేణులకు స్పష్టంగా సంకేతాలు



ఖమ్మం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి ఎంపీ నామా నాగేశ్వరరావు పోటీ చేయబోతున్నారు. ఇప్పటికే ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామా పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన విషయం విదితమే. కాగా నామా పార్టీ మారతారని, బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నుంచి బరిలో ఉంటారని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతున్న విషయం విదితమే. కొన్ని రోజులుగా తన కుమారుడి వివాహ వేడుకల్లో బిజీగా ఉన్న నామా వేడుకల కార్యక్రమం పూర్తికావడంతో పార్టీ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. కాగా ఇటీవల జరుగుతున్న ప్రచారాన్ని కొందరు ముఖ్య నాయకులు నామా దృష్టికి తేగా తాను బీఆర్‌ఎస్ నుంచే ఖమ్మం ఎన్నికల్లో బరిలో దిగుతానని పేర్కొన్నట్టు తెలిసింది. కష్టకాలంలో ఉన్న పార్టీ అధినేత కేసీఆర్‌కు అండగా ఉండి ఎన్నికలను ఎదుర్కొంటామే తప్ప, పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదని నామా స్పష్టం చేసినట్టు తెలిసింది. కాగా ఈడీ కస్టడీలో ఉన్న కవితను కలిసేందుకు నామా గురువారం ఢిల్లీ వెళ్లినట్టు సమాచారం. నామా ఒకటి, రెండు రోజుల్లో ఖమ్మం వచ్చి పూర్తిగా ఎన్నికల కార్యక్రమంలోనే నిమగ్నం కానున్నారు. ఇప్పటికే జిల్లాలో ముఖ్య నేతలకు ఫోన్ చేసి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం విస్తృతంగా పనిచేయాలని, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచనలు ఇస్తున్నారు.



నగరంలోని ఆదిత్య థియేటర్‌లో ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న రజాకార్ యూనిట్ సభ్యులు

నగరంలో 'రజాకార్' యూనిట్ సందడి


ఖమ్మం సాంస్కృతికం, మార్చి 21: ఖమ్మంలో గురువారం రాత్రి హీరోయిన్ అనసూయతోపాటు రజాకార్ సినిమా యూనిట్ సందడి చేసింది. చిత్రం ప్రదర్శిస్తున్న ఆదిత్య థియేటర్‌కు చిత్రంలో కథానాయికగా నటించిన అనసూయ, సినిమా దర్శకుడు యాట సత్యనారాయణతోపాటు నటీనటులు విచ్చేశారు. కొద్దిసేపు ప్రేక్షకులతో కలిసి సినిమా చూసి ముచ్చటించారు. ఈ సందర్భంగా అనసూయ ప్రసంగిస్తుండగా ప్రేక్షకుల అరుపులు, కేకలు, ఈలలతో థియేటర్ దద్దరిల్లింది. నిజాం నిరంకుశ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసే సదుద్దేశ్యంతోనే రజాకార్ చిత్రాన్ని తెరకెక్కించటం జరిగిందన్నారు. చిత్ర దర్శకుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. రజాకార్ల అకృత్యాలను చాటడమే సినిమా ధ్యేయం అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన షోయబుల్లాఖాన్‌తోపాటు ఎందరో నిజాం అకృత్యాలకు గురయ్యారన్నారు.

బార్‌లో ఎన్నికల సందడి

అధ్యక్ష బరిలో ముగ్గురు

ఖమ్మం లీగల్, మార్చి 21: 2024-25 సంవత్సరానికిగాను జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు గురువారం ప్రకటించారు. మొత్తం ఓటర్లు 940మంది ఉన్నారు. అధ్యక్ష పదవికి కన్నెబోయిన నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి పోటీ పడుతుండగా, ప్రధానకార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కళ్యాణి పోటీలో ఉన్నారు. మిగతా పోస్టులు ఏకగ్రీవం అయ్యాయని ఎన్నికల అధికారి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కె.ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కండే వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎజ్జగాని శ్రీనివాసరావు, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా అలవాల యుగంధర్‌రావు, మహిళా ప్రతినిధిగా తన్నీరు లలిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు మారగాని శ్రీనివాసరావు, కూరపాటి శేఖర్‌రాజు, రాయల పావెల్లు తెలిపారు.

వైరా మునిసిపాలిటీలో కలకలం



- సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు సస్పెన్షన్
- ఇంటి పన్నుల కుంభకోణంలో ఉన్నతాధికారుల చర్య
- సమగ్ర విచారణకు సీపీఎం డిమాండ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైరా, మార్చి 21: వైరా మునిసిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్ (యూడీసీ)గా పనిచేస్తున్న సీహెచ్.శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం ఆదేశాలిచ్చారు. కమిషనర్ లాగిన్‌ను ఉపయోగించి వేలాదిరూపాయలు ముడుపులు గుంజి రివిజన్ పేరుతో ఓ పెట్రోల్ బంకు, నాలుగు ఇళ్లకు పన్నులను తగ్గించిన ఫిర్యాదులపై శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు.

ఈ వ్యవహారానికి సంబంధించి ఆడియో సంభాషణలు సైతం ఉన్నతాధికారులకు చేరడంతోపాటు బహిర్గతం కావడం, 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వరుస కథనాలతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ బుధ, గురువారాల్లో ప్రాథమిక విచారణ నిర్వహించి కమిషనర్ వేణు నుంచి నివేదిక తీసుకొని వేటు వేశారు.

సత్తుపల్లి మునిసిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్ అయిన శ్రీనివాసరావు గత నాలుగేళ్ల నుంచి వైరా మునిసిపాలిటీలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయనపై పలురకాల ఆరోపణలు ఉన్నాయి. ఓ వైపున మునిసిపాలిటీలో అనేక రెట్లు పన్నుల భారం పెరగడం, సీపీఎం, బీఆర్‌ఎస్ ఆందోళనలు చేయగా, ఇదే సమయంలో ముడుపులు ముట్టజెప్పిన వారికి భారీగా పన్నులు తగ్గించటం పెద్ద దుమారం రేపింది. దీంతో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఏమాత్రం ఉపేక్షించకుండా శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించనున్నారు.

సమగ్ర విచారణ జరపాలి...

వైరా మునిసిపాలిటీలో అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మునిసిపాలిటీ అధికారులు, పాలకవర్గం కలిసి వైరా మునిసిపాలిటీలో వేలాది ఇంటిస్థలాలకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు చేయించుకునే అవకాశాలను కల్పించారని ఆరోపించారు. భారీగా పెంచిన ఆస్తి పన్నును తగ్గించాలని ప్రజలు ఉద్యమం చేస్తే పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించకుండా ముడుపులు చెల్లించిన వారికి మాత్రమే పన్నులు తగ్గించారని తెలిపారు.



'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ప్రచురితమైన కథనం

PUBLIC NOTICE

This is to inform to the Public ni large that our Corporation has sanctioned a Term Loan of Rs.50.00.00 lakhs each to **Dr. B. SRINIVASA RAO and Dr. B. SRIDEVI,** C/o.M/s.Sreedevi Nursing Home. H.No. 11-2-86 & 86/1, NST Road.Balaji Nagar, Khammam Town and District for purchase of Electro Medical Equipment under Practicing Doctor Scheme. The following property is offered as Collateral Security for the above Loan:

COLLATERAL SECURITY:

Item No.I: Sri Bollikonda Srinivasa Rao is offering freehold interest in commercial building bearing D.No.8-1-207 along with land admeasuring 50.24 sq. yds., situated at Bogamkunta Bazar (B.K.Bazar), Khammam Muncipal Corporation Limits, Khammam Town and District, together with buildings constructed/ to be constructed thereon. The property is bounded by East : Municipal Road, West: Property of Gunteti Srinivasa Rao (open Land). North: Wall & House of Late Gunteti Thumaali, South: House of D. Narasimha Rao.

The surety is claiming title to the above property by virtue of Regd. Sale deed Doc.No.6166/2018. Dt.04.06.2018.

Item No.II: Smt. Bollikonda Sridevi is offering freehold interest in building bearing D.No.8-1-230 along with land admeasuring 122.00 sq. yds, situated at Bogamkunta Bazar (B.K.Bazar), Khammam Muncipal Corporation Limits, Khammam Town and District, together with buildings constructed/ to be constructed thereon. The property is bounded by East: Wall and House of Sri Basheeruddin, West: Municipal Lane, North: Municipal Lane, South: Wall and House of Habimunnisa Begum.

The surety is claiming title to the above property by virtue of Regd. Sale deed Doc. No. 1548/2010, Dt.26.02.2010.

Hence, any person/institution, banks, having any claim/right/interest or any objections for mortgage of the above properly in favour of our corporation shall inform to the undersigned in writing with the documentary proof/evidence within 7 days of this notice, otherwise it shall be deemed that the above properties are free from encumbrance, charges, adverse elaims and the corporation will proceed further with the equitable mortgage transaction. Please note that objections received after the said notice period are not at all binding on the Corporation.

Sd/- BRANCH MANAGER
A.P. STATE FINANCIAL CORPORATION
E. Rama Rao Complex, 2nd Floor,
STATION ROAD, KHAMMAM (08743-234566)

Date : 21.03.2024

టెన్నిస్‌లో మెరుస్తున్న సహజ

- చైనాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపిక
- ప్రపంచ ర్యాంకింగ్‌లో 306వ స్థానం
- తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నెంబర్ వన్



ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 21: తన 10వ ఏటనే లాన్ టెన్నిస్ క్రీడపై మక్కువ పెంచుకున్న నగరానికి చెందిన యామలపల్లి సహజ... అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రపంచ పోటీలకు ఎంపికైంది. ఆమె తల్లిదండ్రులు యామలపల్లి భవానీప్రసాద్, సుప్రియ దిగువ మధ్యతరగతికి చెందిన వారు. సహజలోని క్రీడా నైపుణ్యాన్ని చూసిన భవానీప్రసాద్.. తన ప్రైవేటు ఉద్యోగాన్ని వదులుకొని అండగా నిలిచాడు. చిన్నతనంలో సరదాగా స్నేహితులతో కలిసి రాకెట్ పట్టిన సహజ.. ఆ తరువాత వెనక్కితిరిగి చూడలేదు. 2021లో ప్రపంచ ర్యాంకింగ్‌లలో 1300వ స్థానంలో ఉన్న ఆమె రెండేళ్ళు బెంగుళూరులో పిబిఐ అకాడమీలో తర్ఫీదు పొంది ప్రస్తుతం 306 ర్యాంక్‌కు చేరుకుంది. జాతీయస్థాయిలో రెండో ర్యాంక్, తెలంగాణా రాష్ట్రంలో నెంబర్ వన్ ర్యాంక్‌లో నిలవడం విశేషం. ఈ ప్రతిభతోనే ఇండియన్ టెన్నిస్ ఫెడరేషన్ ఆమెను వచ్చే నెలలో చైనాలో జరిగే బిలీజియన్ కింగ్ కప్ ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపిక చేసింది.

స్పాన్సర్లు ముందుకు రావాలి...



ఖమ్మం పటేల్ స్టేడియం కోచ్‌లతో సహజ

టెన్నిస్ క్రీడలో రాణిస్తున్న సహజకు విదేశాలలో జరిగే టోర్నీలలో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవున్నాయి. ప్రతిభ ఉన్నప్పటికీ చాలా ఖర్చుతో కూడుకున్న విషయం కాబట్టి వెనుకంజ వేయాల్సి వస్తుందని ఆమె తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ కూతురు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణించి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలంటే ఆర్థికంగా ఆదుకునేందుకు ఎవరైనా స్పాన్సర్లు ముందుకు రావాలని కోరుతున్నారు.

గడప గడపకు ఆరు గ్యారెంటీలు: మాధురిరెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న పొంగులేటి మాధురిరెడ్డి

ఖమ్మం రూరల్, మార్చి 21: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలు గడప గడపకు అందుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి మాధురిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతి బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన న్యాయం చేకూర్చే బాధ్యత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకుంటారని భరోసా కల్పించారు. ఏ కష్టమొచ్చినా, ఆపదలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కళ్ళెం వెంకటరెడ్డి, నాయకులు బండి జగదీశ్, మద్దిమల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, సుధాకర్, కిషోర్‌రెడ్డి, అశోక్‌నాయక్, కృష్ణారావు, అంజయ్య, నారాయణ పాల్గొన్నారు.

దమ్మపేట, మార్చి21: దమ్మపేట మండల పరిధిలోని పట్వారిగూడెం, సుధాపల్లి గ్రామాలలో పలు కుటుంబాలను రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురిరెడ్డి గురువారం పరామర్శించారు. సుధాపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మల్లారి నాగరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అదే గ్రామానికి కాం గ్రెస్ పార్టీ నాయకుడు కోటగిరి యుగంధర్ తల్లి అనారోగ్యానికి గురికాగా ఆమెను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చిన్నంశెట్టి యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, జూపల్లి ప్రమోద్, జూపల్లి ఉపేంద్రబాబు, సాయిల నర్సింహారావు, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, ఈశ్వరప్రగడ భూషణం, పర్వతనేని ప్రసాద్, చిట్టినాయన తదితరులున్నారు.

దారితప్పిన ఉపాధ్యాయుడు

- విద్యార్థినులపై వేధింపులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు

టేకులపల్లి, మార్చి 21: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఆలస్యంగా వెలుగుచూసింది. భద్రాది కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అనుచితంగా, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థినుల పట్ల ఆ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించినట్లు తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా బోడు పాఠశాల హెచ్‌ఎం జగన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

ఇల్లెందు, మార్చి 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. చీమల నవీన్ తన భార్య అనూషకు పురిటి నొప్పులు రావడంతో ఆమెను కొత్తగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం అనూష ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. వీరిలో ఇద్దరు మగ శిశువులు కాగా మరొకరు ఆడ శిశువు. అనుషకు ఇది తొలిచూరు కాన్పు అని, తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

స్థలం తీసుకున్నారు..పరిహారం మరిచారు

- నిలిచిన పంచాయతీ భవన ప్రారంభోత్సవం
- సమస్య పరిష్కరించాలంటున్న మహిళ



నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం

దుమ్ముగూడెం, మార్చి 21: గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలమిచ్చిన ఓ ఆదివాసీ మహిళకు ఆర్థిక పరిహారం అందడం గగనంగా మారింది. భర్తను కోల్పోయి బిడ్డల పంచన బతుకుతున్న ఆమెకు ఒప్పందం చేసుకున్న నగదు చేతికంద లేదు. గ్రామపంచాయతీ తీర్మానం చేసిన విధంగా పూర్తిస్థాయిలో నగదు పరిహారం చెల్లించకపోవడంతో నూతన పంచాయతీ భవన ప్రారంభోత్సవం అర్ధాంతరంగా నిలిచిపోయింది. పంచాయతీ పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో ఒప్పందం చేసుకున్న డబ్బులు ఎవరిస్తారో తెలియక భవన నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన దుస్థితి ఆమెకు ఎదురైంది. ఒప్పంద సమయంలో రూ.లక్ష ఇస్తానని తీర్మానం చేసిన నాటి పాలకవర్గం కేవలం రూ.50వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటే మిగతా సొమ్ములు ఎవరిస్తారని బాధితురాలు ప్రశ్నిస్తోంది.

రూ.లక్ష ఇస్తామని..రూ.50వేలు ఇచ్చారు

పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన ఆదివాసీ వితంతువుకు రూ.లక్ష చెల్లిస్తామని ఒప్పందం చేసుకొన్న తాజా మాజీ పంచాయతీ పాలకవర్గం కేవలం రూ.50 వేలు మాత్రమే చేతిలో పెట్టారు. బీకొత్తగూడెం గ్రామపంచాయతీ నిర్మాణానికి రూ.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. నిర్మాణానికి స్థలం అవసరమవడంతో స్థానిక ఆదివాసీ మహిళ బుద్దుల వెంకమ్మ నుంచి ఎనిమిది సెంట్ల స్థలాన్ని తాజా మాజీ పంచాయతీ పాలకవర్గం సేకరించింది. స్థలానికి రూ.లక్ష పరిహారం చెల్లిస్తామని పంచాయతీ తీర్మానం చేయడంతోపాటు, స్థల యజమానురాలితో ఒప్పందం చేసుకున్నారు. పాత పాలకవర్గం వెంకమ్మకు కేవలం రూ.50వేలు మాత్రమే చెల్లించి, మిగతా సొమ్ముపై విషయం ఎటూ తేల్చలేదు. భవన నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ, ఆమెకు మిగిలిన రూ.50వేలు చేతికందలేదు. దీంతో భవన నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు పూర్తయినా ప్రారంభోత్సవం జరగడం లేదు. ఇటీవల ఒక ప్రజాప్రతినిధి చేతుల మీదుగా నూతన పంచాయతీ భవన నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేయగా, బాధితురాలు అడ్డుకుంది. సమస్యను పరిష్కరించే వరకూ భవన ప్రారంభం చేయడానికి వీల్లేదంటూ అడ్డుపడింది.

ఎవరూ పట్టించుకోవడం లేదు.. వెంకమ్మ బాధిత మహిళ



తనకు రావాల్సిన రూ50వేల పరిహారం విషయాన్ని పాత పాలకవర్గం పట్టించు కోలేదు. ప్రస్తుత కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా సరిగ్గా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

ఎన్నికల కోడ్ బేఖాతర్

- ఎంపీ ల్యాడ్స్ నిధులతో రోడ్ల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

వైరా, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని తోసిరాదని వైరా మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణం యథేచ్ఛగా సాగుతుంది. 2019-2020, 2022-2023, 2023-2024 సంవత్సరాలకు సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధులను ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు జిల్లాలోని ఖమ్మం నగర కార్పొరేషన్ అలాగే సత్తుపల్లి, మధిర మునిసిపాలిటీలతో పాటు ఆయా మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. కోట్ల రూపాయల నిధులు కేటాయించారు. ఎంపీ నామా ప్రతిపాదనల మేరకు కలెక్టర్ గౌతమ్ ఈ నెల ఒకటిన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయితే ఈనెల 16న దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకటనతోనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి ఎలాంటి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు కానీ, సంక్షేమ, అభివృద్ధి పథకాల నిర్మాణాలు కానీ చేసేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనలు అంగీకరించవు. ప్రత్యేక పరిస్థితుల్లో ఏదైనా పని చేయాలంటే విధిగా ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరైన వెంటనే మండలంలోని కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పుడు తాఫీగా మూడు రోజుల నుంచి రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఖానాపురం, ముసలిమడుగు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుంది. షెడ్యూల్ కంటే ముందు తమకేమీ పట్టనట్లు వ్యవహరించిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు హడావుడిగా నిర్మాణాన్ని చేపట్టారని ఆరోపణలు ఉన్నాయి. మట్టి రోడ్డును చదును చేయడం దానిపైన సన్నటి కంకర పర్చటం చేశారు. ఎన్నికల కోడ్ బేఖాతర్ చేస్తూ ఈ రోడ్ల నిర్మాణం చేస్తున్నారనే విమర్శలున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని ఇతర రాజకీయ పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ విషయమై వైరా పీఆర్ ఏఈ దేవప్రసాద్‌ను వివరణ కోరగా షెడ్యూల్ కంటే ముందే రోడ్లు చదును చేసి సన్నటి కంకర పరిచిన రోడ్ల పనులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. షెడ్యూల్ కంటే ముందు పనులు ప్రారంభమైనందున వాటి నిర్మాణానికి ఎన్నికల నిబంధనలు అడ్డుకాబోవని అభిప్రాయపడ్డారు. కొత్త రోడ్ల నిర్మాణాన్ని మాత్రం చేయనివ్వమని స్పష్టం చేశారు.



ఖానాపురంలో బుధవారం నిర్మించిన సీసీ రోడ్డు



ముసలిమడుగులో రోడ్డును చదును చేసి కంకర తోలిన దృశ్యం

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి: సీపీ

ఖమ్మంక్రైం, మార్చి 21: ట్రైనీ కానిస్టేబుళ్లు వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు 9 నెలల శిక్షణ చాలా కీలకైందని పోలీస్ కమిషనర్ సునిదల్‌దత్ అన్నారు. నగరంలోని పోలీసు శిక్షణ కేంద్రాన్ని గురువారం సీపీ సందర్శించి శిక్షణను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఉజ్వల భవిష్యత్‌కు సుదీర్ఘకాలం పాటు సగర్వంగా అందించబోయే సేవలకు శిక్షణ చాలా కీలకమైందన్నారు. ఇందుకోసం కావాల్సిన శక్తి సామర్థ్యాలను నిబద్ధతను శిక్షణలో నేర్పిస్తామని పేర్కొన్నారు. మీలక్ష్యాలను నెరవేర్చుకోవడానికి అంకితభావంతో ముందుకెళ్తా శాఖకు పేరు, ప్రఖ్యాతలు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ గణేష్, ఏసీపీ రవి, ఏఆర్‌ఏసీపీ నర్సయ్య, ఆర్‌ఐలు తిరుపతి, అప్పలనాయుడు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.



శిక్షణ పొందుతన్న కానిస్టేబుళ్లను పరిశీలిస్తున్న సీపీ

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి: సీఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌బాబు

ఖమ్మంక్రైం, మార్చి 21: వాహనదారులు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు అన్నారు. నగరంలోని జడ్పీసెంటర్ వద్ద శుక్రవారం హెల్మెట్ వాడకం వలన కలిగే లాభాలపై పలువురు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడంతోనే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా నగరంలో నెంబరు ప్లేటు లేకుండా రోడ్లపై తిరుగుతున్న ఆరు ద్విచక్ర వాహనాలపై నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రవి, వెంకన్న, సాగర్, పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో మోకీలు ఆపరేషన్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి21: ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆర్థోసేవలు మరిం త మెరుగుపడ్డాయి. జూలూరుపాడుకు చెందిన అంగోతు మల్లీశ్వరి కొన్నేళ్లుగా మోకీలు బాధతో తీవ్ర ఇబ్బందులు పడుతుంది. ఈ క్రమంలో ఈనెల 11న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఆమెను పరిక్షించి మోకీలు మార్పిడి ఆపరేషన్ చేయాలని సిఫారస్ చేశారు. దీంతో ఆమెకు గత గురువారం నాడు జిల్లా ఆస్పత్రిలో సూపరింటెండెంట్, ఆర్థో విభాగం అధిపతి డాక్టర్ కిరణ్‌కుమార్ సారథ్యంలో ఆపరేషన్ చేశారు. దీంతో ఆమె పూర్తిగా కోలుకుంది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ డాక్టర్ వినయ్, పవన్ వైద్యులను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.



మహిళ పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారులు

ఆర్టీసీ బస్సు జప్తునకు ఆదేశం

ఖమ్మం లీగల్, మార్చి 21: న్యాయస్థానం ఆదేశించినప్పటికీ రోడ్డుప్రమాదం కేసులో పరిహారాన్ని కోర్టులో జమచేయనందుకు ఆర్టీసీ ఇంద్ర బస్సును జప్తుచేయాలని ఖమ్మం ఐదో అదనపు జిల్లా న్యాయాధికారి దేవినేని రాంప్రసాదరావు ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెనికి చెందిన విద్యార్థి నీలగొండరాసి చంద్రకాంత్‌ను నల్గొండ జిల్లాలోని హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019 అక్టోబరు 14న తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడి కుడి పాదానికి తీవ్రగాయం కావటంతో చంద్రకాంత్ తనకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం జిల్లాకోర్టులో 2020 సెప్టెంబరు 30న టీఎస్ ఆర్టీసీపై కేసు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం వాదనలు విన్న ఐదో అదనపు జిల్లా న్యాయాధికారి బాధితుడికి రూ.6,14,630 7.5శాతం వడ్డీతో సహా కేసు దాఖలు చేసిన తేదీ నుంచి చెల్లించాలని టీఎస్‌ఆర్‌టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

అయినప్పటికీ పరిహారం చెల్లించకపోవడంతో బాధితుడు చంద్రకాంత్ కోర్టుతీర్పు అమలు కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆర్టీసీకి చెందిన ఇంద్ర బస్సును జప్తు చేయాలని న్యాయాధికారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పిటీషనర్ తరపున న్యాయవాదిగా ఇమ్మడి లక్ష్మీనారాయణ వాదించారు.

అధిక వడ్డీ ఆశచూపి కుచ్చుటోపీ

- రూ.కోట్లలో అప్పుచేసి ఉడాయించిన వ్యక్తి
- తాళ్లమడ గ్రామంలో ఘటన

సత్తుపల్లి, మార్చి21: చీరెలు, బంగారం వ్యాపారం చేస్తున్నామంటూ, పెట్టుబడులు అవసరమని పెద్ద మొత్తంలో వడ్డీకూడా ఇస్తామని ఆశచూపి పలువురు నుంచి ఓ వ్యక్తి రూ.లక్షల్లో అప్పులు చేసి ఉడాయించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...సత్తుపల్లి మండలం తాళ్లమడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొదట చీరెల వ్యాపారం అంటూ ప్రారంభించి, ఆ తరువాత జ్యూయలరీ షాప్‌ను గంగారంలో ప్రారంభించాడు. కొంతకాలం షాప్ నిర్వహిస్తూ తాళ్లమడ, బేతుపల్లి, గంగారం, పాకలగూడెం, సత్తుపల్లిలలో అనేకమంది వద్ద రూ.లక్షల్లో అప్పులు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. వడ్డీ ఎక్కువగా ఇస్తానని నమ్మించడంతో ఆశపడి అప్పు ఇచ్చి మోసపోయామని బాధితులు వాపోయారు. కొద్ది రోజులుగా అప్పు తీసుకున్న వ్యక్తి కనిపించకపోవడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తి ఆయా గ్రామాలలో పలువురి నుంచి రూ.3కోట్ల వరకు అప్పులు చేసినట్లు బాధితులు తెలిపారు. కాగా బాధితులు అందరూ ఇటీవల సమావేశమై లెక్కలు తేల్చారు. తాము ఇచ్చిన అప్పు ఎలా రాబట్టుకోవాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. నమ్మించి మోసం చేసి పెద్దమొత్తంలో డబ్బులతో ఉడాయించిన వ్యక్తికి సంబంధించి పోలీసులను ఆశ్రయించాలని బాధితులు నిర్ణయించారు.

ఆర్అండ్‌బీ స్థలాల ఆక్రమణ

- ప్రమాదాలకు నిలయంగా మారిన కల్లూరు సెంటర్
- ఆర్అండ్‌బీ స్థలాలను చిరువ్యాపారులకు అద్దెకు ఇచ్చిన యజమానులు
- పట్టించుకోని అధికారులు

కల్లూరు, మార్చి 21: కల్లూరు పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో రాష్ట్ర హైవే రహదారికి ఇరువైపుల ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణలకు గురికావడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. స్థానికంగా గల ప్రధాన సెంటర్‌లో రహదారి ఇరువైపుల 50 అడుగుల దూరంలో విస్తరించి ఉంది. అయితే నిత్యం ఈ రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దేశంలో పలు రాష్ట్రాలకు చెందిన వందలాది వాహనాలు ఇటువైపుగా తిరుగుతుంటాయి. ప్రస్తుతం ఈ రహదారి జాతీయ రహదారిగా కూడా విస్తరించే స్థాయిలో వాహనాల రద్దీతో తలపిస్తుంది. స్థానికంగా ప్రధాన (అంబేద్కర్) సెంటర్ నాలువైపుల ఈ ప్రదేశం కూడలిగా విస్తరించింది. ఇదే ప్రదేశంలో ఖమ్మం టు సత్తుపల్లి, ఆంధ్ర వైపునకు వెళ్లే ఆర్టీసీ బస్సులు కూడా ఇక్కడే ఆగుతాయి. మధిర వైపున వెళ్లే రహదారి మూల మలుపు వద్ద ప్రయాణికులు ఖమ్మం వెపునకు వెళ్లేందుకు నిరీక్షిస్తుంటారు. అయితే ఇక్కడ ప్రధాన సమస్యను ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ వారి షాపింగ్ కాంప్లెక్స్ యాజమానులు తమ ఇష్టారాజ్యంగా ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమించి ఎదురుగా ఉన్న గల స్థలంలో అక్రమంగా చిరువ్యాపారులకు అద్దెలకు ఇచ్చి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తెలిసింది. ప్రధాన సెంటర్‌లో రహదరికి ఇరువైపుల గల భవనాల యాజమానులు కూడా ఇదే తంతును కొనసాగిస్తున్నారు. మరో వైపున కల్లూరు పట్టణంలో ప్రధాన రహదారి నిత్యం జనసంచారంతో రద్దీగా ఉంటుంది. అంబేద్కర్ సెంటర్‌లో మాత్రం ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించేందుకు రహదారి ప్రక్కన స్థలం లేక రోడ్డుపైకి ఎక్కాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో వాహనాల రద్దీతో గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. పలువురు మృత్యువాత పడ్డారు. ఇలా కల్లూరు మెయిన్ సెంటర్‌లో ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమిస్తుండటంతో స్టేట్ హైవే రహదారి విస్తీర్ణం పరిమితంగా ఉండటంతో ఈ ప్రదేశం ప్రమాదాలకు నిలయంగా మారింది. భవనాల యాజమానులు మాత్రం ఆర్అండ్‌బి (రహదారి) స్థలాన్ని అద్దెలకు ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కల్లూరు పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టి రహదారికి ఇరువైపుల హద్దులు నిర్ణయించి వాటి పరిధిలో మాత్రమే షాపులు ఉండాలని పలువురిని హెచ్చరించారు.



నిరీక్షణకు స్థలం లేక రోడ్డెక్కిన ప్రయాణికులు

కాని పూర్తి స్థాయిలో నివారణకు చర్యలు చేపట్టని పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సెంటర్‌లో ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్ర మించిన దుకాణాలను తొలగించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగ్గురి బైండోవర్

ఏన్కూరు, మార్చి 21: మండలంలో ముగ్గురిపై ముందస్తు బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఏన్కూరులో ఇద్దరిపై, అక్కినాపురంతండాలో ఒకరిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కారేపల్లి ఎక్సైజ్ అధికారులు సారా తయారీ అమ్మకం దారులపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా గురువారం ఎక్సైజ్ పోలీసులు స్థానిక తహసీల్దార్ ఎదుట వీరిని హాజరుపరిచారు. వీరిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయని తహసీల్దార్ శేషగిరిరావు తెలిపారు.

300 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం

ఏన్కూరు, మార్చి 21: మండలంలోని గార్లొడ్డు సమీపంలో సారా స్థావరాలపై గురువారం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేసి 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఖమ్మం డీటీఎఫ్ టీం, కారేపల్లి ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు లీటర్ల సారాతో పాటు 20 కేజీల పట్టికను, ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈదాడుల్లో డీటీఎఫ్ ఎక్సైజ్ అధికారులు కరుణశ్రీ, వాల్‌రాజ్, నాగేశ్వరరావు, విశ్వనాథ్, కృష్ణవేణి, నిర్మల, వసంత సిబ్బంది పాల్గొన్నారు.

రెండు మట్టి ట్రాక్టర్లు సీజ్

జూలూరుపాడు, మార్చి21: మండలంలోని కొత్తూరు గ్రామ సమీపంలో సీతారామ కాల్వ మట్టిని ట్రాక్టర్లలో బుధవారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తుండటంతో పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. గురువారం ఎస్ఐ జీవన్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండల పరిధిలోని ఒంటిగుడిసె గ్రామానికి చెందిన బాలు అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా సీతారామ కాల్వకు చెందిన మట్టిని ట్రాక్టర్లలో విక్రయించేందుకు తరలిస్తున్నారని తెలిపారు. తమ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మండలంలోని జడలచింత గ్రామ సమీపంలో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి, తహసీల్దారుకు అప్పగించినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- 16,900నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం

ఖమ్మంక్రైం, మార్చి 21: నగరంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను గురువారం ఖమ్మం టుటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టుటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బైపాస్‌రోడ్డులోని ధరణి లాడ్జిలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు టుటౌన్ ఎస్ఐ రవి సిబ్బందితో కలిసి లాడ్జిపై దాడి చేయగా ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.16,900 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకపాలకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

గోదావరి వారధిపై నుంచి దూకి
వ్యక్తి ఆత్మహత్య



రాజు మృతదేహం

భద్రాచలం, మార్చి 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని గోదావరి వారధిపై నుంచి దూకి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. పాల్వంచ కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌గా పని చేస్తున్న శేషం రాజు(46) గోదావరి వారధిపై నుంచి గోదావరిలోకి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న భద్రాచలం ఎస్ఐ విజయలక్ష్మి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం బంధువులకు సమాచారం ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహా న్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి నర్సరీకి నిప్పు

కామేపల్లి, మార్చి 21: కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం పెద్దమ్మతల్లి నర్సరీకు గురువారం నిప్పంటుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సరీ పక్కన ఉన్న ఓ రైతు పంట చేనుకు మంట పెట్టడంతో అది కాస్త గాలివాటానికి నర్సరీకి మంట అంటుకుంది. ఫైర్ ఇంజన్ సిబ్బం ది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

బెల్టు షాపులపై దాడి

- 133 మద్యం బాటిళ్లు స్వాధీనం

దమ్మపేట, మార్చి 21: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన పాత చీపురుగూడెంలో జరిగిం ది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్ట్‌షాపులలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి గురువారం బెల్ట్‌షాప్‌లపై దాడి చేశారు. ఈఘటనలో 133 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కున్నారు. వీటి విలువ రూ.26,334 ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

అనుమతులు లేకుండా మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంచం పట్టిన ఎల్లన్ననగర్

- జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
- ప్రత్యేకవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన కొణిజర్ల ఆరోగ్యశాఖ
- జ్వరపీడితుల నుంచి రక్తనమూనాల సేకరణ

కొణిజర్ల, మార్చి21: కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామపంచాయతీ ఎల్లన్ననగర్ గ్రామస్థులు జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాలపై సర్వే చేశారు. ఇప్పటి వరకు గ్రామంలో 15మందికి జ్వరాలు వచ్చిన్నట్లు సర్వేలో ఆరోగ్య సిబ్బంది తెలుసుకున్నారు. అనుమానం ఉన్న ప్రజలందరి రక్త నమూనాలను సేకరించారు. సర్వే చేసిన వైద్య సిబ్బంది గ్రామస్తులను పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఎవరూ ఆందోళన చెందవద్దని గ్రామస్థులకు సూచనలు చేశారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన జ్వరాలు కావని, జ్వరాలు అదుపులోకి వస్తున్నాయని వైద్యాధికారులు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్యాధికారి రాధాకృష్ణ, మెడికల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు, సిబ్బంది రాజేష్, తులసి, దివ్య, నరసింహరావు, రవికుమార్ పాల్గొన్నారు.



ఎల్లన్ననగర్ గ్రామంలో జ్వరాలపై ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్న వైద్యబృందం



రక్తనమూనాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

ఔషధ కంపెనీపై కేసు నమోదు



కొత్తగూడెం ఔషధ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి21: అధిక ధరలు ముద్రించిన ఓ ఔషధ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు ఉమ్మడి జిల్లాల సహాయ సంచాలకులు జి.ప్రసాద్ గురువా రం తెలిపారు. కొత్తగూడెం పట్టణంలో పలు మెడికల్ ఏజెన్సీ లలో తనిఖీలు చేపట్టారు. డెక్సాల్యాబ్ అనే ఇంజక్షన్‌పై రూ. 29 బదులుగా రూ.39 ముద్రించడాన్ని గుర్తించారు. అధిక ధరలను ముద్రించి అమ్మకాలు చేస్తున్న ల్యాబోరేట్‌ఫార్మా స్యూటికల్స్ కంపెనీపై ఔషధ ధరల నియంత్రణ చట్టం 2013 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనలో భద్రాద్రి జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సీహెచ్.సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ విజేత
ఖమ్మం అకాడమీ జట్టు

● ముగిసిన పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఎర్రుపాలెం, మార్చి 21: మండలంలోని జమలాపురం గ్రామంలో హథిరామ్ బాబాజీ, సంత్ సేవాలల్ భక్త సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల స్థా యి కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. హోళీ పండుగ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి సీనియర్, జూనియర్ కబడ్డీ పోటీలు గత నాలుగు రోజులుగా రాత్రి సమయాల్లో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో ఖమ్మం పట్టణానికి చెందిన ఖమ్మం అకాడమీ జట్టు ప్రథమ బహుమతి రూ.25 వేలు గెలుపొందగా ద్వితీయ బహుమతిని ఏపీలోని విజయవాడకు చెందిన కృష్ణ అకాడమీ జట్టు రూ.20 వేలను గెలుపొందాయి. జూనియర్స్ విభాగంలో మొదటి, రెండో బహుమతులను ఖమ్మం, విజయవాడ, గన్నవ రం జట్లు గెలుపొందాయి. ప్రతీ సంవత్సరం హోలీ సంద ర్భంగా గ్రామంలోని బంజారాలు దాతల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు భూక్యా గోపినాయక్ తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

నాణ్యతకు తిలోదకాలు

- నాసిరకం ఇసుక వినియోగం
- హడావుడిగా సీసీ పనులు
- అప్పుడే రోడ్డుకు పగుళ్లు
- ముంచుకొస్తున్న గడువు
- రహదారులు పదికాలాలు నిలిచేనా?

జూలూరుపాడు, మార్చి 21: ప్రజల రాకపోకలకు రహదారులు ప్రధాన భూమిక వహిస్తాయి. అంతటి ప్రధానమైన రహదారులు పదికాలాలపాటు ప్రజలకు ఉపయోగపడడానికి మన్నికగా నిర్మించాలి. నాసిరకంగా నిర్మించిన నిర్మాణాలు ఎంతో కాలం నిలువవు. జూలూరుపాడు మండలంలోని 24 పంచాయతీలలో ఎన్ఆర్ఈజీఎస్(జాతీయ గ్రామీణ ఉపాధి పథకం) ద్వారా రూ.1.47కోట్ల నిధులతో గ్రామాలలో 32సీసీ రహదారుల నిర్మాణాలను చేపట్టాల్సివుంది. పంచాయతీరాజ్‌శాఖ పర్యవేక్షణలో రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మార్చి31 నాటికి వీటిని పూర్తి చేస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు అవుతాయి. గడువు తరుముకొస్తుండటంతో కాంట్రాక్టర్లు హడావుడిగా పనులు ప్రారంభించారు. ఇప్పటికే వెంగన్నపాలెం, జూలూరుపాడు, పడమటనర్సాపురం గ్రామాలలో సీసీ రహదారులు నిర్మించారు.



పడమటనర్సాపురంలో నిర్మించిన సీసీ రహదారి

నాసిరకం పనులు.. అప్పుడే పగుళ్లు..

రహదారుల నిర్మాణానికి గోదావరి ఇసుకని వినియోగించాలి. ఆ ఇసుకను ఇక్కడకు తరలించాడానికి కొన్ని ఆంక్షలు అడ్డుగా వున్నాయన్న సాకుతో స్థానిక వాగుల్లో లభించే దొరికే ఇసుకను వాడుతున్నారు. జూలూరుపాడు మండలంలోని బేతాళపాడు, దుబ్బతండా గ్రామాల సమీపంలోని వాగులు, చండ్రుగొండ మండలంలోని గానుగపాడు వాగులో నుంచి అర్థరాత్రి నాసిరకపు ఇసుకను తీసుకవచ్చి కాంట్రాక్టర్లు రహదారుల నిర్మాణాలను చేపడుతున్నారు. స్థానికంగా వాగులలో లభించే నాసిరకపు ఇసుకను వాడవద్దని పంచాయతీరాజ్ అధికారులు ఆదేశించినప్పటికి అధికార పార్టీ నాయకుల అండతో కాంట్రాక్టర్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి నోరుమూయిస్తున్నారు. దీంతో రహదారుల నిర్మాణాలను నాసిరకంగా చేపడుతున్నప్పటికి అధికారులు మౌనంగా చూడటం తప్ప ఏమిచేయలేని నిస్సహాయులుగా మిగిలిపోయారు. నిర్మాణాలు పూర్తయి బిల్లులు మంజూరుకావడానికై కొద్ది సమయమే ఉండటంతో కాంట్రాక్టర్లు హడావుడిగా పనులను చేపడుతున్నారు. నాసిరకపు ఇసుకను వినియోగించి నాణ్యతలేని పనుల వల్ల ఇప్పటికే కొన్ని రహదారులపై పగుళ్లు (ఎయిర్ క్రాక్‌లు) కన్పిస్తున్నాయి. ఈ మొక్కుబడి నిర్మాణాలు ఎంతకాలం ఉంటాయోనని ప్రజలలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మండల స్థాయి నుంచి నియోజకవర్గస్థాయి అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాం ట్రాక్టర్లకు దన్నుగా ఉం డటంతో ప్రజలు రాకపోకలను సాగించే అందుకు నాణ్యమైన రహదారులు నిర్మించలేని పరిస్థితి నెలకొంది.



సీసీకి వినియోగిస్తున్న నాసిరకం ఇసుక

కాంట్రాక్టర్లు వాళ్లే..

మండలంలోని 24 పంచాయతీలలో కూడా అధికార పార్టీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామాలలో సీసీ రహదారుల నిర్మాణాలను చేపడుతుండటం గమనార్హం. వైరా నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఈ నెల 25 నాటికి రహదారుల పనులు పూర్తి చేయాల్సిందేనని అధికారులకు హుకుం జారి చేసినట్లు వినికిడి. ఇక ఇదే అదునుగా భావించిన కాంట్రాక్టర్లు నాసిరకపు నిర్మాణాలను హడావుడిగా చేపడుతున్నారని ప్రజలు అంటున్నారు. నిర్మించిన రహదారులు ఎంతకాలం ఉంటాయోనని వారు అంటున్నారు. ఎక్కువ కాలం ఉండని రహదారులను నిర్మించి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు పాటించకపోతే బిల్లులు నిలిపివేస్తాం

నాగేంద్ర, పంచాయతీరాజ్ ఏఈ

గ్రామాలలో కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా సీసీ రహదారుల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించాం. తప్పనిసరిగా గోదావరి ఇసుకను వినియోగించి రహదారులను నిర్మించాల్సివుంది. కాగా కాంట్రాక్టర్లు స్థానిక వాగుల్లో లభించే ఇసుకతో నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. దీంతో పనులు నిలిపివేయాలని సంబధిత కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీచేశాం.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

●ఏసీబీ డీఎస్పీ రమేష్

ఖమ్మం క్రైం, మార్చి 21: ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని అవినీతి నిరోదకశాఖ డీఎస్పీ వై.రమేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రజల పనులు చేసేందుకు ప్రభుత్వ అధికారులు లంచాలు అడిగితే 9154388981, 9154388984 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదుచేయాలని తెలిపారు. ఫిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంటాయని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీక్

●తప్పిన ప్రమాదం

చుంచుపల్లి, మార్చి21: ప్రమాదవశాత్తు వంట గ్యాస్ సిలిండర్‌లో నుంచి మంటలు ఎగిసి పడగా.. పెను ప్రమాదం తప్పిన సంఘటన భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని చుంచుపల్లి తండాలో నివసిస్తున్న భూక్యా మంగత్య అనే వ్యక్తి ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అయింది. దీంతో మంటలు ఎగిసిపడుతుండగా స్థానికు లు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. దీంతో హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకున్న చుంచుపల్లి ఎస్‌హెచ్‌వో ప్రవీణ్‌కుమార్ చాకచక్యంగా వ్యవహరించి ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేశారు. కర్ర సహాయంతో వంట గ్యాస్ సిలిం డర్ రెగ్యులేటర్ వద్ద మంటలు అంటుకోకుండా నిలువరించారు.



గ్యాస్ సిలిండర్ మంటలను ఆర్పుతున్న ఎస్ఐ

'గూడెం' చేరుకున్న
'ఆటో బతుకుల' ప్రచార రథం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి21: ఆటో కార్మి కుల జీవితాలను కళ్లకు అద్దం పట్టేలా చిత్రీకరించిన ఆ టో బతుకుల సీరియల్ ప్రచార రథ యాత్ర జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి గురువారం చేరుకుంది. రాష్ట్రం లో నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఆటో డ్రైవర్ల జీవన విధానాన్ని ప్రతిబింబించేలా వంద ఎపిసోడ్‌ల ఈ సీరియల్ నటుడు, ఆటో డ్రైవర్ రవికుమార్ చిత్రీకరిం చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నందుకు ప్యాసింజర్ ఆటోలకు గిరాకీ లేకపోవడంతో ఆటో డ్రైవర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సీరియల్‌ను నిర్మించారు. అదేవిధంగా ఆటో కార్మికులను ఆదుకోవా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చే స్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సీరియల్‌ను ప్రతి ఒక్కరు వీక్షించి ఆదరించాలని, ఆటో డ్రైవర్లకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీడీయు పట్టణ కార్యదర్శి మాటేటి వెంకట్, నాయకు లు జీడి శ్రీనివాస్, ధర్మపురి నరేష్, రాజు, రమేష్, వెంకట్, మాధవరావు, శ్రీకర్, చందు పాల్గొన్నారు.



కొత్తగూడెం బస్టాండ్ సెం

వైభవంగా రణాసురుడి నిండు జాతర



దేవరగుట్ట నుంచి వనం తీసుకొస్తున్న పూజారులు, భక్తులు

ఆళ్లపల్లి, మార్చి 21: ఆళ్లపల్లి మండలం, నడిమిగూడెంలో పాయం వంశీయుల ఆరాధ్యదైవమైన రణాసురుడు జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఊరగుట్ట నుంచి రణాసురుడు ని గర్భగుడికి తీసుకరాగా, గురువారం వనదేవత భక్తుల కోరికలు తీర్చేందుకు వనం నుంచి జనంలోకి వచ్చింది. పాయం వంశీయులు, పూజారులు, భక్తి శ్రద్దలతో వనదేవతను దేవరగుట్ట నుంచి అంగరంగ వైభవంగా డోలీలు, నృత్యాలు, అగ్నిహోమాలతో వనదేవతకు ఎదుర్కోళ్లు నిర్వహించి దేవుళ్లను గద్దెల పైకి చేర్చారు. అనంతరం పెద్ద ఎత్తున నిండు జాతర నిర్వహించారు. కార్యక్రమంలో పాయం వంశీయులు, పూజారులు, తలపతులు, వడ్డేలు, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

- పైప్‌లైన్, గేట్‌వాల్ నిర్మాణానికి ఆర్థికసాయం చేసిన యువకుడు

కామేపల్లి, మార్చి 21: కామేపల్లి మండల పరిధిలోని నెమలిపురి గ్రామ పంచాయతీలో 15రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ ఖాతాలో నిధులు లేకపోవడంతో అధికారులు సమస్య పరిష్కరానికి కృషి చేయలేదు. ప్రజల అవసరాల దృష్ట్యా మంచినీటి ఎద్దడిని గమనించిన అదేగ్రామానికి చెందిన గిరిజన యువకుడు సపావట్ రవినాయక్ ప్రజల అవసరాలకు గ్రామంలోని మంచినీటి బావుల వద్ద నుంచి నూతన పైప్‌లైన్లు, గేట్ వాల్స్‌ను ఏర్పాటుకు సహకరించాడు. సుమారు రూ.లక్ష వరకు గ్రామానికి పెట్టుబడి పెట్టాడు. దింతో గ్రామస్థులు యువకుడిని అభినందించారు.



నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నామా చొరవతో బాధితునికి
రూ.3 లక్షల ఆర్థిక సాయం మంజూరు

ఖమ్మం సాంస్కృతికం మార్చి 21: బీఆర్ఎస్ లోక్ సభాపక్షనేత, ఖమ్మం పార్లమెంటు సభ్యుడు నామా నాగేశ్వరరావు చొరవతో అనారోగ్య బాధితుడికి ప్రధాన మంత్రి సహాయనిధినుంచి రూ. 3లక్షలు మంజూరయ్యాయి. వైరా మండలం, సోమవరం సుందరయ్యనగర్‌కు చెందిన కట్ల శ్రీకాంత్ కుమారుడు ధృవంశ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం పెద్దమొత్తంలో డబ్బు అవసరం కావటంతో బాధితుడు ఎంపీని కలిసి తన పరిస్థితి వివరించి సాయం కోరటంతో వెంటనే స్పందించిన నామా ప్రధానమంత్రి కార్యాలయంతో మాట్లాడి సాయాన్ని మంజూరు చేయించారు.

బస్తీ, పల్లె దవాఖానాలను పటిష్ఠం చేయాలి

- వైద్యుల ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ఆరోగ్య కార్యక్రమాల అమలు బావుండాలి
- ప్రోగ్రాం అధికారులతో డీహెచ్ రవీందర్‌నాయక్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 21: ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాలు విస్తృతం చేసి ఆరోగ్య సమాజం గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులతో జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల పై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ బస్తీదవాఖానాలు, పల్లెదవాఖానాలను పటిష్ఠం చేసి అక్కడ అన్ని వైద్య ఆరోగ్య చికిత్సలు అందించాలన్నారు. వైద్యాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం మాతా శిశు సంక్షేమ కార్యక్రమం, ఇమ్యూనైజేషన్ కార్యక్రమం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ కీటక జనిత రోగ నివారణ కార్యక్రమం, జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమం, అసంక్రమణ వ్యాధుల నివారణ కార్యక్రమం మొదలైన కార్యక్రమాల పై సమీక్షించారు. ప్రోగ్రాం అధికారులు కార్యక్రమ అమలులో నిబద్ధత పాటించాలన్నారు. జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో అధికారులు చొరవ చూపి అమలైన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో అప్‌డేట్ చేసి జిల్లాను రాష్ట్రంలో నెంబర్ వన్ గా ఉంచాలని ఆయన తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రి లలో సీ సెక్షన్ ఆపరేషన్ లు తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచే విదంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ సైదులు, డాక్టర్ సీతారాం, డీఐవో డాక్టర్ ప్రమీల, డాక్టర్ చందు నాయక్, డీఎల్‌వో డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ భాస్కర్ నాయక్, డెమో కాశీనాథ్, ఎన్‌హెచ్ఎం డీపీవో సీలోహన, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత హైదరాబాద్ నుంచి ఆయన నేరుగా ఖమ్మం వస్తూ మార్గమధ్యలో కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా వైద్య ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు.



డీహెచ్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యాధికారులు

బొగ్గు లోడింగ్‌తో ఆరోగ్య సమస్యలు

సత్తుపల్లిరూరల్, మార్చి 21: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి ప్రభావిత ప్రాంతమైన కిష్టారం గ్రామస్థులు గురువారం జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాదను కలిసి వినతిపత్రం అందజేశారు. బొగ్గు లోడింగ్ పాయింట్ అయిన సైలో బంకర్‌కు దగ్గరగా ఉన్న గ్రామంలోని అంబే ద్కర్‌నగర్ వాసులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతు న్నారని అన్నారు. సింగరేణి బాంబ్ బ్లాస్టింగుల కారణంగా ఎస్సీబీసీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, రావి నాగేశ్వరరావు, చెట్టుమాల రేణుక ఈశ్వర్, కొలపనేని ధనుంజయరావు, నరుకుళ్ల శేషగిరావు, గుడ్లూరి రమణయ్య, ఉడతనేని భాను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కిష్టారం గ్రామస్థుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న కిష్టారం గ్రామస్థులు

సూర్యనారాయణ మృతికి మంత్రి తుమ్మల నివాళి



నివాళులర్పిస్తున్న తుమ్మల (ఇన్‌సెట్‌లో) సూర్యనారాయణ (ఫైల్)

దమ్మపేట, మార్చి 21: నాగుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, తుమ్మల బంధువు పొన్నగంటి సూర్యనారాయణ (70) బుధవారం రాత్రి ఆయన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూర్యనారాయణ మృతదేహాన్ని గురువారం సందర్శి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించారు. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఉప్పనూతల ఏడుకొండలు, ఎంపీపీ సోయం ప్రసాదు, దమ్మపేట సొసైటి చైర్మన్ ఎల్లిన రాఘవరావు,ఎల్లిన మురళి, రావు గంధరరావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, కేవి సత్యనారాయణ, ఎర్రగొర్ల రాధాకృష్ణ , జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, పలువురు గ్రామస్థులు వున్నారు.

పెరిగిన విత్తన ధరలు..

- పత్తి రైతుల విలవిల
- 2019లో బీటీ-2 విత్తన సంచి ధర రూ.710
- ప్రస్తుతం ధర రూ. 864



ఖమ్మం వ్యవసాయం, మార్చి 21: పత్తి సాగు చేస్తే లాభాలు బాగుంటాయని చాలా మంది అన్నదాతలు ఆ వైపు దృష్టి సారిస్తున్నారు. వర్షాకాలం ఆరంభంలో సాగు వైపు మొగ్గు చూపుతుంటారు. అంతకంటే ముందుగానే విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుతున్నారు. కానీ విత్తన కంపెనీలు మాత్రం ఏటా ధర పెంచుతూ రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. ఓ పక్క పత్తికి ధర లేక కర్షకులు ఇబ్బందిపడుతుంటే మరోపక్క విత్తన ప్యాకెట్ల ధర పెరగటంతో రైతులు తలపట్టుకుంటున్నారు. గత సంవత్సరం సంచి(బీటీ-2) రూ.853 ధర ఉండగా ఈ సీజన్‌లో రూ.864కు చేరుకుంది. పత్తి విత్తన సంచుల ధర 2019లో రూ. 710 ఉంది. 2020లో రూ.730, 2021లో 767రూ. 2022లో రూ.810, 2023లో రూ. 853, 2024లో రూ. 864గా విత్తన కంపెనీలు ధరలు పెంచాయి.

ఏటా పెరుగుతున్న పెట్టుబడులు

పత్తి సాగుకు ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నారు. విత్తనం, సేద్యంతో పాటు పురుగుమందులకు రూ.వేలు పెట్టుబడులు పెడుతున్నారు. ముఖ్యంగా విత్తన కంపెనీలు ధరలను ఏటా పెంచుతుండటంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. బీటీ పత్తి విత్తనాల ధర గత ఆరేళ్లుగా పెరుగుతూనే ఉంది. 2019లో విత్తనాల సంచి ధర రూ.710 ఉండగా ఇప్పుడు రూ. 864కు చేరింది. అంటే సంచికి రూ.154 పెరిగింది.



గత వానాకాలంలో 2,21,448 ఎకరాల్లో పత్తిసాగు

ఖమ్మం జిల్లాలో గత సాధారణ వానాకాలం సాగు లక్ష్యం 5,40,191 ఎకరాలు కాగా 4,99,471 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. పత్తి 2,34,117 ఎకరాల లక్ష్యానికి గాను 2,21,448 ఎకరాలు సాగు చేశారు. మూడేళ్ల క్రితం మూడు లక్షల ఎకరాలు ఉంటే రానురాను తగ్గిపోతుంది. ముఖ్యంగా వైరా, సత్తుపల్లి, మధిర, కూసుమంచి, పాల్వంచ, జూలూరుపాడు మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. పెట్టుబడులు ఎక్కువగా ఉండి ధర లేకపోవటంతో సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. జిల్లాలోని రైతులు గుంటూరు వెళ్లి పత్తి విత్తనాలను కొనుగోలు చేసుకొని వస్తుంటారు. విడతల వారీగా పురుగుమందులు, ఎరువులు కూడా అక్కడకి వెళ్లి తెచ్చుకునే రైతులు చాలా మందే ఉన్నారు.

బ్లాక్‌లో విక్రయాలు

పత్తి విత్తనాల కొరత తీవ్రంగా ఉంది. వేసవి ఆరంభం నుంచే కొందరు రైతులు ముందుగానే విత్తనాలను తెచ్చుకొని సిద్ధంగా ఉంచు కుంటారు. వర్షాలు కురిసిన తర్వాత వ్యాపారులు ధర అమాంతంగా పెంచేస్తుంటారు. విత్తనాలు దొరకని పరిస్థితి ఉంటుంది. ఒక్కో సంచిని రూ.1300 వరకు అమ్మటంతో గత్యంతరం లేక రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు రెండు సంచుల విత్తనాలు అవసరం ఉంటాయి. ఒక్కో రైతు ఐదు ఎకరాల వరకు సాగు చేస్తుంటారు. అలాంటివారికి పది సంచుల విత్తనాలు అవసరం ఉంటాయి. విత్తనాల ధరలు పెరుగుతుతుండటంతో అన్నదాతలకు అదనంగా భారం పడుతుంది. ఈ పాటికే కంపెనీలు ధర పెంచడంతో రూ.లక్షల్లో నష్టపోవాల్సి వస్తోంది. అందుకు తగ్గట్టుగానే పత్తి ధర ఉంటే ఎలాంటి సమస్య ఉండదు.



కవుల వేదికగా నిలిచిన 'సృజన'

కవిత్వ భావనపట్ల విద్యార్థులు, యువతలో ఆసక్తి కలిగిస్తున్న సమాఖ్య

సత్తుపల్లి, మార్చి21: కవిత్వ ప్రచురణలో కవుల వేదికగా 'సృజన సాహితీ సమాఖ్య' నిలిచింది. సత్తుపల్లి కేంద్రంగా రెండు దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన సృజన సాహితీ సమాఖ్య నేటితరం విద్యార్థులు, యువతలో కవిత్వ భావనల పట్ల ఆసక్తి కలిగించే విధంగానూ, కవులను ప్రోత్సహించే లక్ష్యంతో సమాఖ్య ద్వారా పలువురు కవులను ప్రోత్సహించి పుస్తక ఆవిష్కరణలను చేశారు. సృజన సాహితీ సమాఖ్య రెండు దశాబ్దాలుగా పలు పుస్తకాలను ప్రముఖులచే ఆవిష్కరింపజేసింది. ఈ క్రమంలో సాంప్రదాయ పద్య సాహిత్యం మొదలుకొని కవిత్వ ఆధునిక పోకడలతో హైకూలు వంటి రీతులలో కవులు రచించిన సాహిత్యాన్ని సైతం సమాఖ్య ద్వారా ప్రచురించారు. ఆధ్యాత్మిక, సందేశాత్మక, రైతు సమస్యలు, మానవ మూలాలు, సామాజిక సమస్యలు, విభిన్నమైన ఇతివృత్తాలతో రాసిన కవిత్వాన్ని సమాఖ్య ద్వారా ప్రచురించారు. చిన్నారులను సైతం పుస్తక పఠనం, రచనల వైపు మళ్లించే క్రమంలో బాలసాహిత్యాన్ని కూడా ప్రోత్సహించారు. పుస్తక పఠనం పట్ల ఆసక్తి తగ్గుతున్న నేపధ్యంలో విద్యార్థులలో ఆసక్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు సృజన సాహితీ సమాఖ్య కార్యక్రమం చేపడుతోంది.

సృజన ప్రచురణలు

కవిత్వంలో కాకలు తీరిన ప్రముఖులతో పాటు యువ కవులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించడం ద్వారా కవిత్వాన్ని ప్రచురించాలని సమాఖ్య నిర్ణయించింది. ఈ మేరకు 2003లో బొబ్బిలి జోసెఫ్ రాసిన గరికపూలు, పూల చినుకులు, 2004లో దూపాటి సౌభాగ్యలక్ష్మీ రాసిన గీతమాలిక, 2006లో సృజన కరదీపిక కవితోత్సవం, 2007లో నియోగి రాసిన నేగళ్లు, వల్లడి, 2008లో సుస్వశ్రేష్ఠ రచన ఆవన, 2010లో తెలంగాణ ఉద్యమ నేపధ్యంలో ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా కవులు రాసిన ఉద్యమ గీతాల పుస్తకం కొలిమి, 2012లో సాయిరాం రచన మొలకెత్తిన గింజలు, కట్టా శ్రీనివాస్ కవిత్వం మట్టి వేళ్లు, 2014లో అమృతవర్షిణి జయరాజు రచన ఓ వేకువ కోసం, 2017లో మాదిరాజు మాలతి రాసిన మినీ కవిత్వం ఔను... నిజం, గతేడాది ఆర్.రమణమూర్తి, పీవీఎస్.మల్లిఖార్జునరావుల సంయుక్త రచన మల్లికా రమణీయం సృజన ఆధ్వర్యంలో ప్రచురించారు.

కవితా దినోత్సవం సందర్భంగా సమీక్ష

మార్చి 21ను యునెస్కో 1991లో ప్రపంచ కవితా దినోత్సవాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతియేటా సృజన ఆధ్వర్యంలో కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం సత్తుపల్లిలో సృజన సాహితీ సమాఖ్య బాధ్యులు ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించారు. మాన వ మేధస్సులో సృజనాత్మక శక్తులను పెంపొందించి ఎల్లలు, సరిహద్దులను దాటి కవిత్వాన్ని వ్యాప్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సృజన నిర్ణయించింది. 2దశాబ్దాల కాలంలో నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమీక్షా కార్యక్రమంలో సృజన బాధ్యులు రామకృష్ణ, వాసు, మధుసూదనరాజు, మాదిరాజు మాలతి, అయ్యదేవర శేషగిరిరావు, మల్లిఖార్జునరావు, రమణమూర్తి, పిచ్చయ్య పాల్గొన్నారు.



మల్లికా రమణీయం పుస్తక ఆవిష్కరణ (ఫైల్)

WALK - IN - INTERVIEW

ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు. కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూలలకు హాజరుకాగలరు.

ఆంధ్రజ్యోతి

డివిజన్ సేల్స్ రిప్రజెంటెటివ్స్ (SR)

భద్రాచలం, పాల్వంచ

అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చేవిధంగా పని చేయవలసి ఉంటుంది. అభ్యర్థి కనీస అర్హతఇంటర్‌మరియు సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను. అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును. పై అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగలరు

ఇంటర్వ్యూ తేది: 23-03-2024 ఉ॥ 10:00 నుండి మ॥ 2 గంటలు వరకు


ఇంటర్వ్యూ స్థలము : సర్క్యులేషన్ మేనేజర్

ఆంధ్రజ్యోతి కార్యాలయం.

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్స్ నెం: 112, ఇండస్ట్రియల్ ఏరియా ఖానాపురం హవేలి, శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, ఖమ్మం

సెల్: 9985411350

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి 8 శుక్రవారం 22 మార్చి 2024



ఉపాధి పనుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి: డీఆర్‌డీవో

బోనకల్, మార్చి 21: ఉపాధి పనుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని డీఆర్‌డీవో సన్యాసయ్య ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి పనులకు సంబంధించి రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేలా కృషి చేయాలన్నారు. రోజువారి కూలీలు ఎంత మంది పనులకు వస్తున్నారని ప్రశ్నించారు. మండల వ్యాప్తంగా 2100 మంది కూలీలు పనులకు వస్తున్నారని తెలిపారు. పనుల కల్పన, రోజువారీ హాజరు వివరాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పని ప్రదేశం వద్ద కూలీలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. చేసిన పనులకు సంబంధించి కొలతలను పూర్తి చేసి వాటిని వెంటనే అప్‌డేట్ చేయాలని కోరారు. గ్రామాలలో ఉపాధి పనుల కల్పన గురించి ప్రజలను చైతన్య పరిచే బాధ్యతను అందరూ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, ఎంపీవో శాస్త్రీ, ఏపీవో కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమై జీవించాలి

- సత్తుపల్లి ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల
- జిల్లావ్యాప్తంగా ఘనంగా అటవీ దినోత్సవం




ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు, మాట్లాడుతున్న ఎఫ్‌డీవో మంజుల

సత్తుపల్లిరూరల్, మార్చి21: ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడమే అర్థవంతమైన జీవితమని సత్తుపల్లి ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లిలో అటవీ అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నీలాద్రి అర్బన్ పార్క్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అడవులను సంరక్షించుచునే దిశగా ప్రజలకు అవగాహన కలిగించే నిమిత్తం ఈఅటవీ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో రేంజర్ స్నేహలత, ఎఫ్ఎస్‌వోలు, డీఆర్‌వోలు, బీట్‌ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల రక్షణ... మనందరి బాధ్యత

తల్లాడ: ప్రాణవాయువు, ఫలాలను ఇచ్చే అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్ అన్నారు. అటవీశాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. జీవజాతి మనుగడకు అడవులే ఆధారమని, అడవులు మనకు రక్షణ, మనకు సంపద అని పేర్కొన్నారు. అడవులకు మనమిచ్చే బహుమతి వాటిని కాపాడుకోవడమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వోలు శ్రీనివాసరావు, కటికి వెంకట రామారావు, నాగమణి, పలువురు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వనాలు పెంచు.. వానలు వచ్చు

ఖమ్మంసంక్షేమవిభాగం: వనాలు పెంచు.. వానలు వచ్చు.. అంటూ వినూత్నంగా విద్యార్థులతో కలిసి జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ అధికారులు గొంతు కలిపి రోడ్డెక్కి ర్యాలీలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఎఫ్‌డీవో ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో ఎఫ్ఆర్వోలు బెల్లం రాధిక, శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిర్వహించారు. జిల్లా అటవీశాఖ కార్యాలయం నుంచి ఖమ్మంనగరంలోని ప్రధాన రహదారి వెంట అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు, మహిళా కాలేజీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డీఆర్వోలు లక్ష్మీపతి, రవికుమార్, సురేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ముదిగొండలో అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో గణేష్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి21: లోక్‌సభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రింటింగ్‌ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రింటింగ్ ప్రెస్, పెట్రోల్‌బంక్, గోల్డ్ షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రచురించే ప్రచార సామగ్రిపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్ నెంబర్, ప్రచురణ ప్రతుల సంఖ్య, ప్రచురించే అభ్యర్థి పేరు, చిరునామా వివరాలు తప్పని సరిగా ముద్రించాలని తెలిపారు. ప్రింటింగ్, పబ్లిషర్ పేరు లేకుండా ఎన్నికల అంశాలతో ముడిపడిన పోస్టర్లు, కరపత్రాలు,ఇతర ప్రచార సామగ్రిని ముద్రించినా, నిర్దేశించిన సంఖ్యకు మించి ముద్రించినా ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని ప్రజాప్రాతినిధ్య చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. పెట్రోల్ బంక్, గోల్డ్ షాపుల నిర్వాహకులు రోజువారి లావాదేవీల వివరాలు, డబ్బు లావాదేవీలు జరిపే వారి వివరాలు తెలియజేసి వాటికి సంబంధించిన విక్రయాలు నగదుకు సంబంధించి వివరాలు తెలియాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి మురళీధర్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ ప్రింటింగ్ ప్రెస్, పెట్రోల్ల బంక్, గోల్డ్ షాపుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తిరుమలాయపాలెం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ రామకృష్ణ సందర్శించారు. తాళ్లచెరువు, తిమ్మక్కపేట, ఎర్రగడ్డ, కొక్కిరేణి, తిరుమలాయపాలెం, పిండిప్రోలు, హైదర సాయిపేట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మణ్, బీఎల్‌వోలు రమేష్, అనిత, సుస్మిత, నవీన్, మాధవి, రమ్య, అనూష పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

పెనుబల్లి: లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కల్లూరు ఆర్డీవో శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. పెనుబల్లి, బయ్యన్నగూడెం, తుమ్మలపల్లి, కారాయిగూడెం, కొత్తకారాయిగూడెం, కుప్పెనకుంట్ల, చింతగూడెం, మర్లకుంట, కేఎంబంజర్, గణేశులపాడు, కోండ్రుపాడు, అడవిమల్లెల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించారు. విద్యుత్, తాగునీటితోపాటు మౌళిక వసతులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో మౌళిక సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, గిర్దావర్‌లు అక్బర్, విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు టీచర్లు పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేయాలి

ముదిగొండ: పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో గణేష్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలోఅధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏఏ సౌకర్యాలు ఏర్పాటుచేయాలనే అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎస్ఐ నరేష్, ఎంపీవో సూర్య నారాయణ, ఏవో రాధ, ఐబీ డీఈ పెద్దరాంబాబు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన ఉండాలి: డాక్టర్ మౌనిక



అవగాహన కలిగిస్తున్న డాక్టర్ మౌనిక

ఏన్కూరు, మార్చి21: ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బాలికలకు టీబీవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈసందర్భంగా సీహెచ్‌సీ వైద్యులు మౌనిక మాట్లాడుతూ టీబీవ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహార పదార్థాలను వివరించారు. టీబీ వ్యాధి లక్షణాలు రెండు వారాలపైగా దగ్గురావడం రాత్రి సమయంలో ఒంటిపై చెమటలు పట్టడం, జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం ఈ లక్షణాలు కనిపించి నట్టయితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ఎస్‌వో ఉషారాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివరాజు, టీబీ చికిత్స సూపర్‌వైజర్ వై.సురేష్, డీపీఎం కృష్ణ, సీహెచ్ఎన్ పుణ్యవతి, టీ.జయమ్మ, భాస్కర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

పరిశోధన.. చదువులో భాగం కావాలి

- కలెక్టర్ గౌతమ్
- ఘనంగా శ్రీచైతనోత్సవ్ ప్రారంభం




కలెక్టర్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం, ప్రయోగాన్ని తెలుసకుంటున్న గౌతమ్

ఖమ్మంరూరల్, మార్చి21: పరిశోధన అనేది విద్యార్థుల చదువులో భాగం కావాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. మండల పరిధిలోని పొన్నేకల్లులోని శ్రీచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రిసెర్చ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీచైతనోత్సవ్ కార్యక్రమాన్ని గురువారం స్టేట్ బోర్డు టెక్నికల్ ఎడ్యూకేషన్ సెక్రటరీ పుల్లయ్య, సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉజ్వల్‌కుమార్ బెహరాతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, స్టేట్ బోర్డు టెక్నికల్ ఎడ్యూకేషన్ సెక్రటరీ పుల్లయ్య మాట్లాడుతూ ఇతర దేశాల్లో విద్యార్థులకు రీసెర్చ్ పట్ల సామాజిక స్పృహ ఎలా ఉంటుందో తెలియచేశారు. సమాజానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉజ్వల్‌కుమార్ బెహరా మాట్లాడుతు సాంకేతిక పరిజ్ఞానికి అవసరమైన నైపుణ్యం పొందడంలో మెలకువలను ఎలా గుర్తించాలో వివరించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టును తిలకించారు. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, డైరెక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, సీఈఓ శ్రీనివాస్, ఏఓ వైశాలి పాల్గొన్నారు.

వైరా మునిసిపాలిటీలో అవినీతిపైన సమగ్ర విచారణ జరపాలి

వైరా, మార్చి 21: వైరా మునిసిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మునిసిపాలిటీ అధికారులు, పాలకవర్గం కలిసి వైరా మునిసిపాలిటీలో వేలాది ఇంటిస్థలాలకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు చేయించుకునే అవకాశాలను కల్పించారని ఆరోపించారు. ముడుపులు చెల్లించిన వారికి మాత్రమే పన్నులు తగ్గించారని, సమగ్ర విచారణ జరపాలని రాంబాబు డిమాండ్ చేశారు.

త్రివేణి పాఠశాల విద్యార్థికి రూ. 25వేల బహుమతి

ఖమ్మంమామిళ్లగూడెం, మార్చి21:త్రివేణి పాఠశాలకు చెందిన బి.ఆరాధ్య రూ.25వేల నగదు బహుమతిని గెలుచుకుందని ఖమ్మం డివిజనల్ పోస్టల్ సూపరిం టెండెంట్ బి.రవికుమార్ తెలిపారు. తపాలాశాఖ ఆధ్వర్యంలో నేషనల్‌స్థాయి ఢైఅకీర్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్ 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై పోటీ నిర్వహించారు. 18 ఏళ్లలోపు కేటగిరీలో ఆమె ప్రతిభ కనపరిచిందని చెప్పారు. ఆరాధ్యకు పాఠశాల యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన శిక్షణ కలెక్టర్

చింతకాని, మార్చి 21: మండల పరిధిలోని నాగులవంచ, జగన్నాథపురం, రైల్వేకాలనీ, పొద్దుటూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్ గురువారం సందర్శించారు. త్వరలో లోకసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరులో వెలిగిన వీధిలైట్లు



కల్లూరు, మార్చి21: కల్లూరు పట్టణంలోని పలు వీధుల్లో గురువారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వారం నుంచి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వారం రోజులుగా వెలగని వీధిలైట్లు అనే శీర్షికతో ఓ కథనం ప్రచురితమవటం తెలిసిందే.. ఈ కథనంపై గ్రామ పంచాయితీ అధికారులు స్పందించారు. సదరు పంచాయితీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో గతంలో వెలగని వీధిలైట్లులను తొలిగించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామ పంచాయితీ తరుపున కొత్తగా 300 వీధిలైట్లను తెప్పించామని గ్రామ పంచాయితీ ఈవో కృష్ణారావు తెలిపారు. శాంతినగర్‌లో గురువారం కొత్తగా 40 పైగా వీధిలైట్లను ఏర్పాటు చేశారు. మెయిన్ సెంటర్, అంబేద్కర్‌నగర్ తదితర వీధుల్లో ఏర్పాటు చేస్తామని ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ చెప్పారు.

పోషణ పక్షోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 21: ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముస్తాఫనగర్ సెక్టార్ 2 నందు గురువారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో కవిత హాజరయ్యారు. పోషకాహారలోపంతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందన్నారు. పిల్లలకు సరైన పోషకహారం అందించాలన్నారు. పోషకాహారం వలన జరిగే లాభాల గురించి పిల్లల తల్లిదండ్రులకు సీడీపీవో కవిత వివరించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చంద్రుపట్ల గ్రామంలో

కల్లూరు: మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవం కార్యక్రమం నిర్వహించారు. చంద్రుపట్లలోని రైతువేదిక ప్రాంగణంలో సెక్టార్ సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో పలువురు గర్భిణీలకు సాముహిక సీమంతాలు నిర్వహించారు. గిరిజన వంటకాలపై అవగహన కల్పించారు. బాలింతలకు, పిల్లలకు పోషకాహార విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చిట్టెమ్మ, అంగన్వాడీ టిచర్స్ జ్యోతి, సులోచన, శైలజ, వెంకటలక్ష్మీ కరుణ పాల్గొన్నారు.

24న సంత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం

కారేపల్లి,మార్చి21:శ్రీలక్ష్మీపద్మావతి సహిత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవం ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహణాధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేకపూజ కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. 10:30నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు తీర్థాప్రసాదాలు పంపిణీ చేస్తారు. సాయంత్రం ఆరుగంటల నుంచి స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని విన్నవించారు.

శ్రీవిశ్వధర్మ క్షేత్రంలో సౌందర్యలహరి పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, మార్చి21: మండలంలోని బుగ్గపాడులో వేంచేసియున్న శ్రీవిశ్వధర్మక్షేత్రంలోని అన్నపూర్ణ సహిత మోక్ష రుద్రేశ్వర స్వామి వారి దేవాలయంలో గురువారం అన్నపూర్ణ అమ్మవారికి సౌందర్యలహరి పారాయణం నిర్వహించారు. సత్తుపల్లికి చెందిన హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో ఈ పారాయణ కార్యక్రమం సాగగా ప్రత్యేక అభిషేకాలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు, ఆగమ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి బ్రహ్మశ్రీ వెల్లటూరి ప్రసాదాచారి, పాలక మండలి అధ్యక్షుడు తుమ్మూరు శ్రీరామ్‌ప్రసాద్, కమిటీ మెంబర్లు బొడ్డు శివబాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సర్టిఫికెట్ల ప్రదానం

మధిర, మార్చి21: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎస్ ఆఫీస్ కోర్సు పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సర్టిఫికెట్లను గురువారం రిటైర్డ్ ఎండీవో మాధవరపు నాగేశ్వరరావు అందజేశారు. కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. పూర్వవిద్యార్థిగా కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, వైస్‌ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు జీ అరుణ, పీ సుజాత, వీరన్న, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రీతమ్‌ను కలిసిన చెన్నారావు



వైరా, మార్చి21: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరగారి ప్రీతమ్‌ను టీపీసీసీ బీసీ విభాగం రాష్ట్ర కన్వీనర్ దర్శి చెన్నారావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో ప్రీతమ్‌ను చెన్నారావు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కరుణాకర్‌ను కూడా చెన్నారావు మర్యాదపూర్వకంగా కలిశారు.

రాయలకు మున్నూరు కాపు సంఘం అభినందనలు



ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 21: తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియామకం జరిగిన టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావును మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య అభినందనలు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో రాయలను కలిసిన నాయకులు పుష్పగుచ్ఛాన్ని అందించారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర పరిశీలకుడు

ముదిగొండ, మార్చి 21: మండలంలోని మేడేపల్లి జడ్పీఉన్నత పాఠశాలలో పది పరీక్షా కేంద్రాన్ని గురువారం రాష్ట్ర పరిశీలకుడు, జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్ సందర్శించారు. పరీక్షా కేంద్రం అన్ని ఏర్పాట్లు ఉన్నాయా లేవా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలి

- రైతుసంఘం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న గుడవర్తి నాగేశ్వరరావు

నేలకొండపల్లి,మార్చి21: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని రైతుసంఘం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం రావెళ్లభవన్‌లో జరిగిన సీపీఎం మండల సమావేశంలో గుడవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవటానికి తగిన సౌకర్యాలు లేవన్నారు. అవసరమైన కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని, తద్వారా రైతులు పండించిన పంటలకు న్యాయమైన ధరలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి కొప్పుల వెంక్రటామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టికోల వెంకన్న, సామాల మల్లికార్జున్, బెల్లం లక్ష్మీ, దుగ్గి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ రాష్ట్ర నేత కిరణ్‌కు నివాళి

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి 21: ఇఫ్టూ మోటారు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ మృతి తీరని లోటు అని రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య , జిల్లా అధ్యక్షుడు ఏ వెంకన్న నివాళులు అర్పించారు. ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లో గురువారం కన్నుమూశారు. ఈ సందర్భంగా ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంతాప సభలో నాయకులు మాట్లాడారు. కిరణ్‌కు నివాళులు అర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో రంగ కార్మికుల సమస్యల కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించారని గుర్తు చేశారు.

ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, మార్చి 21: జిల్లా కేంద్రం ఖమ్మంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సేవాలాల్ సేన జిల్లా నాయకులు గుగులోత్ నెహ్రూ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తిరుమలాయపాలెంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భగా కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీడీఏ ఏర్పాటు చేస్తుందని హామి ఇచ్చిందని , దానిని అమలు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

జడ్పీటీసీ సభ్యుడికి మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



మోహన్‌రావును పరామర్శిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి, మార్చి21: పెనుబల్లి జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు ఇటీవల అనారోగ్యానికి గురికాగా గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆయనను పరామర్శించారు. అనంతరం భవన్నపాలెం గ్రామంలో కూడా పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావ్, లక్కినేని వినీల్, చెక్కిలాల లక్ష్మణ్‌రావు, చెలికాని నీలాద్రిబాబు, మాయర చిన్ని, రాము, దారా సురేష్, రాంబాబు, కర్రి మోహన్‌రావు, నల్లబోతుల చెన్నారావు, శ్రీను, మల్లయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

ఖమ్మం చర్చికాంపౌండ్, మార్చి 21: క్యాన్సర్ వ్యాధిపై ప్రతీ ఒక్కరు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ కంచర్ల హరీష్ అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్యంలో క్యాన్సర్ నివారణకు పలు రకాల చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కీమోథెరపీతో పాటు టార్గెటెడ్ థెరపీ , ఇమ్యునోథెరపీ లాంటి నూతన వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా చికిత్స పొందవచ్చని తెలిపారు. క్యాన్సర్ నివారణకు చాలా వరకు ఆహార అలవాట్లు మార్చుకోవాలని, మద్యం, ధూమపానం అలవాట్లకు దూరంగా ఉండాలని, శారీరక వ్యాయామం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో యశోద ఆసుపత్రి మేనేజర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

గోవింద్రాల మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడిగా రాందాస్



రాందాస్, రాంచందర్

కామేపల్లి, మార్చి 21: మండల పరిధిలోని గోవింద్రాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గిరిజన మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా లకావత్ రాందాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఎన్నికల అధికారి వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. సంఘంలో 43 మంది పాలకవర్గ సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాలోత్ బావ్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా లకావత్ రాంచందర్, డైరెక్టర్లుగా లఘుపతి, సుఖ్య, కిసన్, ప్రేమ్, రాములును ఎన్నుకున్నారు. వీరిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నర్సింహరెడ్డి, ఏపూరి మహేందర్, పుచ్చకాయల వీరభద్రం అభినందించారు.

తోపుడు బండిపై అరటిగెల అపహరణ

సత్తుపల్లిరూరల్, మార్చి21: అర్ధరాత్రివేళ తోపుడుబండిపై ఉన్న అరటి గెలను అపహరించాడు ఓ దొంగ. సత్తుపల్లి మునిసిపాలిటీలోని వేంసూర్ రోడ్‌లోని బస్టాండ్ కాంప్లెక్స్ ఫుట్‌పాత్‌పై చీపు సురేష్ అరటిపండ్ల వ్యాపారం చేసుకుంటున్నాడు. కాగా బుధవారం అర్ధరాత్రి 1.30సమయంలో ముసుగు వేసుకుని వచ్చిన వ్యక్తి, అరటిపండ్లపై కప్పిన పరదాను తొలగించి అరటిగెలను ఎత్తుకెళ్లాడు. గురువారం వచ్చిన సురేష్‌కు అనుమానం రావడంతో వెనుక షాపులోని సీసీ కెమెరాలో వీడియో ఫుటేజీని పరిశీలించాడు. చిన్న దొంగతనమే అయినా రోజువారీగా అమ్ముకుంటేనే కొందరి జీవితాల్లో కడుపు నిండుతున్నాయని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలంటూ బాధితులు కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పాడు.